

# స్మృతి తరంగాలు

ప్రత్యూష

ఉదయం పదకొండున్నర అయింది.

సూర్యుడు మరింత వేడెక్కి ప్రాణి కోటిని వేధించటం మొదలెట్టాడు. ఆ వేధింపుతో ఏమాత్రం సంబంధంలేకుండా వచ్చేపోయే ప్రయాణీకులతో కోలాహలంగా వుంది బస్టాండు. అందరిలోనూ తొందర తొంగిచూస్తోంది.

రకరకాల మనుషులు, లగేజీలు, వింత వింత ఆకృతులు, ప్రకృతులు మరెన్నో యాసలు. స్వాగతాలకు, వీడ్కోలులకు నెలవుగా అందరి భావాలకు మూగసాక్షులుగా పగలు, రాత్రి అనే తేడాలేకుండా అవిశ్రాంతిగా పనిచేసేవి ఈ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టులేనేమో.

దాచేపల్లి వెళ్ళే బస్సులో ఎక్కి కూర్చున్న శిరీష అసహనంగా వాచీ చూసుకుంది. యీ డ్రైవరు ఇంకా రాడేం? ఈ బస్సు స్టార్టవదేం? అనుకుంది. ఇంతలో డ్రైవర్ మహాశయుడు కిళ్ళీ వేసుకుని హుషారుగా సీట్లోకి దూకాడు. కండక్టర్ టికెట్లగోలలో పడ్డాడు. మరో పది నిమిషాల్లో బస్ కదిలింది.

బస్ వేగాన్ని మించి శిరీష మనోవేగం పుంజుకుంది. అంతే! ఆలోచనల కడలిలో అలలు ఎగసి ఎగసి పడసాగాయి. ఈ ప్రయాణంకోసం ఎన్నాళ్ళుగా కలలు కంటోంది తను! అదీ అక్కయ్యావాళ్ళకు మాచర్ల ట్రాన్స్‌ఫర్ అవటంవల్ల ఇంత దూరం రాగలిగింది. లేకపోతే హైద్రాబాద్ నుంచి పల్నాడులోని ఓ గ్రామానికి

తను వెళ్ళటానికి వీలయ్యేదా? అవును! మాష్టారు ఎలా వున్నారో? తనను చూడగానే ఏమంటారో! అనుకోగానే శిరీషకు ఆ వూరు కళ్ళముందు మెదిలింది. వూరు మొదట్లోనే దర్శనమిచ్చే ఓపెన్ థియేటర్, అది దాటాక ఓ హైస్కూల్, మంచినీళ్ళ బావి, ఇంకా ముందుకి వస్తే బోర్డు సైతంలేని ఎలిమెంటరీ స్కూలు, అటు పక్కగా ప్రవహించే ఏరు. నిజానికి ఈ రోజుల్లో నాన్నగారు ట్రాన్స్ఫర్ అయిందని అమ్మ ఎంత చికాకుపడ్డదని.

ఆ వూళ్ళో కరెంట్ చాలా కొద్దిళ్ళకే వుండేది. నీళ్ళు కావాలంటే ఏటికి వెళ్ళాల్సిందే. పొద్దుగూకితే భయమే. వీలయినంతవరకు రాత్రిళ్ళు మంచాలు, కుర్చీలనే ఆశ్రయించేవాళ్ళు. ఎందుకంటే రాత్రి పూట అప్పుడప్పుడు తేళ్ళు, మండ్రగబ్బలు నేలమీద పచార్లు చేస్తుండేవి.

ఇకపోతే తన చదువు. తను ఆ ఎలిమెంటరీ స్కూల్లో చేరినరోజు మిగతా పిల్లలు ఎంతో గొప్పగా చూశారు. తన చెప్పులు చూసి వాళ్ళెంత ఆనందపడ్డారో. వాళ్ళల్లో చాలామందికి కాళ్ళకు చెప్పులే లేవు. తనను దాదాపు ఓ చిన్న సైజు రాణిని ట్రీట్ చేసినట్లు చేశారు. ఆ టైమ్ లోనే హైస్కూల్లో కూడా ఓ కొత్త అమ్మాయి చేరిందట వాళ్ళ నాన్న ఇంజనీరట. వాళ్ళు గొప్పగా చెప్పుకుంటూంటే ఈ స్కూలువాళ్ళు కూడా 'మా స్కూల్లోనూ ఓ కొత్తమ్మాయి చేరిందిలే' అని గర్వంగా చెప్పుకున్నారు. తమ స్కూలు ఎదురుగుండా ఓ గవర్నమెంటు హాస్పిటల్. దానికి మాత్రం ఓ 'ఆసుపత్రి' అనే బోర్డు వేళ్ళాడుతూ వుండేది. కాని ఆసుపత్రి ఛాయలు ఏ మాత్రం కన్పించేవి కావు. చుట్టూ చింత చెట్లు. సీజన్లో పిల్లలు కొమ్మలు వంచి చిగురు తెంపుకు తింటుండేవాళ్ళు.

తర్వాత హైస్కూల్లో చేరింది. అక్కడే కేశవరావు మాస్టారితో పరిచయం. అది పెరిగి అనుబంధం ఏర్పడింది. కేశవరావు మాస్టారు ఎప్పుడూ నవ్వుతూ పిల్లల్ని నవ్విస్తుండేవారు. కొట్టడమన్నది అసలే లేదు. 'లేపాక్షి' పాఠం చెబుతూ 'లేపాక్షి బసవయ్యా లేచి రావయ్యా!' అంటూ బసవడు 'శిరీషమ్మకు దండం పెట్టు అంటే వెంటనే పెట్టేస్తాడు.' అని మధ్యలో తనని కూడా కలిపేవారు. చాలా సాదా సీదా మనిషి. కాని తనకా వయసులో ఆయన గురించి తెలుసుకోవాలనే ఊహే రాలేదు. ఆయనంటే బోలెడు ఇష్టం మాత్రం వుండేది.

ఓసారి స్కూల్లో వుండగానే పెద్ద వాన వచ్చింది. ఆ వానకి ఆవరణలో వున్న వెలగచెట్టుకున్న కాయలు రాలటంతో అందరితోపాటు తనూ పరుగెత్తింది. ఆ పరుగెత్తడంలో కాల్లో గాజుపెంకు గుచ్చుకోడం, తను 'అమ్మా' అంటూ కూలబడ్డం జరిగింది. అప్పుడు




కేశవరావు మాష్టారు పరుగెత్తుకొచ్చి, గాజుపెంకు తీసేసి శుభ్రంగా కడిగి కట్టు కట్టారు. ఎంతో ఆప్యాయంగా బుజ్జగించి తన సైకిల్ మీద కూర్చోబెట్టుకుని ఇంటి దగ్గర దింపారు. ఆయన ఆప్యాయతలో తను నొప్పిని ఇట్టే మర్చిపోయింది.

ఆ వూరు విడిచి వచ్చేటప్పుడు కేశవరావు మాష్టారు పిల్లల రామాయణ, భారత, భాగవత కథల పుస్తకాలు ప్రెజెంట్ చేశారు. అవిప్పటికీ తన దగ్గర భద్రంగా వున్నాయి.

ఇంకో మాష్టారు పరంధామయ్యగారు. తమ ఇంటికి ఎదురుగుంటా వుండేవాళ్ళు. ఆయన మంచివారే కాని కోపిష్ఠి మనిషి. అసలు ఆయన కోపిష్ఠిగా తయారవటాని క్కారణం ఆ ఇంటి వాతావరణమే అయ్యుండాలి. ఆయనకు రాజుగారు - చేవలు కథలో లాగా ఏడుమంది సంతానం. చివరి ఇద్దరూ మగపిల్లలు. మాష్టారుగారి భార్య ఎప్పుడూ పీర్వంగా పిల్లలమీద కేకలేస్తూ వుండేది. వాళ్ళ మూడో అమ్మాయి సీత తనకన్నా ఓ క్లాసు ఎక్కువ. అయినా స్నేహంగానే వుండేది. ఎదురిల్లే అవటంవల్ల రాకపోకలు బాగా వుండేవి.

తను పరంధామయ్య మాష్టారుకు ఉత్తరం వ్రాపింది, సీతను కూడా అత్తవారింటినుంచి పిలిపించమని. వచ్చిందో, రాలేదో!

ఎవరో చంటిపిల్లాడి ఏడుపు తారాస్థాయిలో విన్పడ్డంతో శిరీష ఒక్కసారిగా ఉలిక్కిపడి స్పృహలోకొచ్చింది.

* * *

ఊరు దగ్గర పడ్తోంది. శిరీష కుతూహలంగా కిటికీలోంచి తొంగిచూస్తోంది. థియేటర్ రానే వచ్చింది. అయితే అది పూర్వంలా లేదు. అల్ట్రా మోడ్రన్‌గా ఉంది 'స్వప్న' అన్న అక్షరాలు కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నాయి. 'నిజంగా ఇదో స్వప్నంలాగే వుంది' అనుకుంది శిరీష. మరికొద్ది సేపట్లో బస్టాండ్‌లో బస్సాగింది. శిరీష తన ఎయిర్‌బాగ్ తీసుకుని మెల్లిగా బస్ దిగింది

"అమ్మా! శిరీషా!" అంటూ పరంధామయ్యగారు ముందుకొచ్చారు. ఆయనలా తనని ముందుగా పలకరించి వుండకపోతే తనసలు గుర్తుపట్టేది కాదేమో. అంతలా మారిపోయారాయన. తల నెరిసి, పళ్ళు వూడి, దవడలు లోపలకు పోయి, రంగు తగ్గి, ఆయనతో వృద్ధాప్యం గాఢంగా చెలిమిచేసినట్లుందా రూపు. "మాష్టారూ!" ఆనందంగా అరిచినంత పనిచేసింది. "నాన్నగారువాళ్ళంత బావున్నారా?" అంటూ ఏవేవో అడుగుతున్నారు. శిరీష జవాబిస్తోంది. ఇహ వుండబట్టలేక "కేశవరావు మాష్టారెలా వున్నా"రని అడిగింది! "బాగానే వున్నారు" అన్నారే కాని అందులో ఏదో అపశ్రుతి. అంతలో మాట తప్పించి ఆ ప్రస్తావన దాటేశారు.

రిక్షాలో వస్తుంటే తోవలో హైస్కూల్ పిల్లలు డ్రెస్‌తో, షూస్‌తో దర్శనమిచ్చారు. శిరీష 'తమ రోజుల్లో డ్రెస్సేలేదు' అనుకుంది. హాస్పిటల్ కళకళలాడ్తోంది. ఎలిమెంటరీ స్కూలు గుర్తుపట్టలేనంత కొత్తగా వుంది, ఆ మాటే పైకంటే, మాష్టారు "కాలం మారలా అమ్మా" అన్నారు.

* * *

ఇల్లు రావడం, సీత వచ్చి శిరీష నమాంతం చుట్టేసుకోవటం జరిగింది.

మాష్టారుగారిభార్య శిరీషవాళ్ళ అమ్మ గురించి మళ్ళీ మళ్ళీ అడిగింది. భోజనాలయ్యాక శిరీష, సీత చిన్ననాటి ముచ్చటెన్నో చెప్పుకున్నారు. శిరీష ఇంకా పెళ్ళి చేసుకోనందుకు సీత "నీకేమోయ్ హాయిగా జాబ్ చేస్తున్నావ్! నేను సంసార కూపంలో పడి కొట్టుకుంటున్నాను" అంది. శిరీష నవ్వింది.

శిరీష కేశవరావు మాష్టారి గురించి అడగ్గానే సీత నిరుత్సాహంగా మొహం పెట్టింది. "మాష్టారుకి పిచ్చెక్కింది శిరీ" అంది. భూమి గిర్రున తిరిగినట్లనిపించింది. "మాష్టారుకి పిచ్చా? నిజంగా? అసలేమయింది?" అంది. "మాష్టారుకి వసంత అనే ఓ అమ్మాయుండేది గుర్తుందా? ఆయన చాలా ముద్దుగా చూసుకునేవారు. ఆ అమ్మాయికి రెండేళ్ళ క్రితమే పెళ్ళిచేసారు. గొప్ప సంబంధం చేస్తే ఆయన కూతురు సుఖపడుతుందని తన శక్తినంతా ధారపోసి డబ్బున్న సంబంధమే చేశారు. ఏం జరిగిందో తెలియదు కాని కొద్దిరోజులకే వసంత కిరో



సిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకుంది. కూతురి శవం చూసిన క్షణంనుండీ మాష్టారు పిచ్చివాళ్ళై పోయారు" అని సీత చెప్పగానే శిరీష స్థాణువైంది. "మాష్టార్ని ఒకసారి వెళ్ళి చూసొస్తాను" అంది మెల్లిగా.

"చూసి ఏం చేస్తావ్? ఆయన ఎవరితోనూ ఒక్కమాట కూడా మాట్లాడరు" అంది సీత. శిరీష మౌనం వహించింది.

* * *

ఆ సాయంత్రం 'మాష్టార్ని చూసి తీరాలి!' అని తీర్మానించుకుని ఒక్కతే బయల్దేరింది. వీధిలో ఆడుకుంటున్న పిల్లల్నడిగి తెలుసుకుని శిథిలావస్థలో వున్న ఆ ఇంట్లోకి అడుగుపెట్టింది. ముందు వసారాలో స్తంభానికానుకుని కూచున్నారు, కేశవరావు మాష్టారు. శుష్కించిన దేహంతో, మాసినగడ్డంతో నీరసంగా, నిర్వికారంగా, ఆ చూపుల్లో జీవంలేదు. అర్థరహితంగా శూన్యంలోకి

చూస్తూ, బహుశ ఈ వికృష్ట ప్రపంచంలో దొరకని శాంతిబిందువు కోసం అక్కడ అన్వేషిస్తున్నారేమో!

ఇంతలో లోపల్నుంచి ఓ పెద్దావిడ మాష్టారి సతీమణి కాబోలు బయటకొచ్చి "ఎవరమ్మా నువ్వు?" అనడిగింది. తమ మాష్టార్ని చూడటానికొచ్చినట్లు చెప్పింది శిరీష. ఆవిడలో అణగారివున్న బడబాగ్ని మళ్ళీ ఒక్కసారిగా ప్రజ్వరిల్లింది. 'కనులలోన గలవు కన్నీటి గనులు' అన్నట్లుగా ఆమె కళ్ళు నిండుకున్నాయి. వణికే గొంతుతో "మా వసంతతోనే మా సుఖశాంతులు వెళ్ళిపోయాయమ్మా! మాటా, పలుకులేవి ఆయన్ని చూసుకుంటూ నేను ఎన్నాళ్ళో. ఎన్నేళ్ళో. నిన్ను చూస్తే మా వసు గుర్తుకొస్తోంది" అంటూ మాష్టారుకి దగ్గరగా వెళ్ళి, "ఏమండీ ఈ అమ్మాయి శిరీష. మీ స్కూల్లో చదువుకుందట. మీ కోసం వచ్చింది" అని చెప్పింది. శిరీష ఆశగా అటు చూసింది. ప్చ్! ఆయన చూపుల్లో మార్పేలేదు. అసలు వినిపించుకున్నట్లే లేదు. "ఇంతేనమ్మా! ఈయన ధోరణి. ఎంత దూరంనుండి వచ్చావో పాపం" అందావిడ. చేసేదిలేక ఆవిడదగ్గర సెలవు తీసుకుంది శిరీష. 'ఒకప్పటి మాష్టారి సదాదరహాస వదనం, ఇప్పటి ఆయన భావరహిత వదనం. శాపగ్రస్తులైన ఆయన జీవితానికి విమోచనం మరణమేనేమో'. శిరీష వులిక్కిపడింది తన ఊహకు.

తమ ఎంతో ఆశగా చేసిన ప్రయాణం యిందుకేనా? అసలీ ప్రయాణం చేయకుండా వుంటేనే బాగుండేదేమో. ఇన్నాళ్ళుగా తన మదిని మురిపించిన మధురోహాలన్నీ చెదిరిపోయాయి. తీపిగా తలపోసినవన్నీ చేదెక్కాయి. స్మృతిశకలాలు వికలమయ్యాయి. శిరీష అంతరంగం బరువెక్కింది.

